**సంపుటము–I**
**సమావేశము–XXX**
**నంబరు. 1**

**వెల : రూ. 3–00**
**06 మార్చి, 2018**
**మంగళవారము**
**హేవళంబి నామ సం.**
**ఫాల్గుణ బ. 5**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు
# ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL DEBATES

## అధికార నివేదిక
## OFFICIAL REPORT

## విషయ సూచిక

| క్రమ సంఖ్య | విషయం | పేజీ నం. |
|---|---|---|
| (1) | సంతాప ప్రతిపాదన<br>ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు సభ్యులు శ్రీ గాలి ముద్దు కృష్ణమనాయుడు గారి మృతిపట్ల సభ సంతాప ప్రతిపాదన | 01–22 |
| (2) | సభా కార్యక్రమం – ప్రకటన | 22–22 |

J. No. 134/18

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | శ్రీ ఎన్. ఎం.డి. ఫరూక్ |
| డెప్యూటీ చైర్మన్ | : | శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం |
| ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీమతి పామిడి శమంతకమణి |
| | | శ్రీ వాకాటి నారాయణ రెడ్డి |
| | | శ్రీ బొడ్డు నాగేశ్వర రావు |
| కార్యదర్శి (ఇన్‌ఛార్జ్) | : | శ్రీ ఎమ్. విజయరాజు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| | | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి. వి. సుబ్బారెడ్డి |
| | | శ్రీ కె. రాజకుమార్ |
| | | శ్రీమతి ఆర్. వనితారాణి |
| | | డా. వై. కామేశ్వరి |
| | | శ్రీ ఇ. సంజీవరావు |
| | | శ్రీ కె. వెంకటేశ్వరరావు |
| | | శ్రీ డి. జగన్‌మోహన్‌రావు |
| | | శ్రీ బి. ప్రభాకరరావు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## 2018, మార్చి 06వ తేది, మంగళవారం

***

(సభ ఉదయం 10.00 గంటలకు 'జనగణమన' జాతీయ గీతాలాపనతో ప్రారంభమైనది.)

(గౌరవ చైర్మన్ అధ్యక్షస్థానంలో ఉన్నారు.)

**MR.CHAIRMAN:** Kala Venkata Rao Garu to move the Condolence Motion on behalf of the Leader of the House.

## 1.**CONDOLENCE MOTION**

SRI KIMIDI KALA VENKATA RAO, HON'BLE MINISTER FOR ENERGY (ON BEHALF OF SRI YANAMALA RAMAKRISHNUDU, LEADER OF THE HOUSE): Sir, I beg to move:

'' That this House places on record its deep sense of sorrow at the demise of Sri Gali Muddukrishnama Naidu, Member of Andhra Pradesh Legislative Council and conveys its deep sense of sympathy to the members of bereaved family. ''

**MR.CHAIRMAN:** Motion moved.

**శ్రీ కిమిడి కళా వెంకట్రావు:** అధ్యక్షా, సభానాయకులు శ్రీ యనమల రామకృష్ణుడు గారి తరఫున ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు సభ్యులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారి మృతిపట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

అధ్యక్షా, సభ్యులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు ఎమ్మెల్యేగా 6 పర్యాయాలు గెలిచారు. 2015లో స్థానిక సంస్థల నుండి ఎమ్మెల్సీగా ఈ సభలో ప్రవేశించారు. సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర కలిగిన వ్యక్తి ఆయన. మనందరికీ కూడా పరిచయస్తుడు, స్నేహితుడు, హితుడు. అలాంటి వ్యక్తి ఈ రోజున మన మధ్య లేకపోవడమన్నది చాలా విచారకరం. ఆయన ఎప్పుడూ కూడా అందరినీ పలకరిస్తూ, స్నేహశీలిగా ఉంటూ, ఎవరు ఏది అడిగినా తన పోర్ట్‌ఫోలియో పరిధిలో ఆ పని వెంటనే చేయిస్తూ, సరదాగా అందరితో కలసిమెలసి ఉండే వ్యక్తి. పొలిటికల్‌గా కూడా తాను ప్రజల మనిషిగా పేరు గడించారు. ప్రజల మనిషిగా ఉంటూ చిన్నా, పెద్దా ఎవ్వరు ఏ పని మీద ఆయన దగ్గరకు వచ్చినా తిరుపతిలో గెస్ట్‌హౌస్‌లో కూర్చుని అందరినీ పలుకరిస్తూ ప్రతివారికీ అందుబాటులో ఉండి తనకంటూ ఒక ఇమేజ్‌ని ఏర్పరుచుకున్న వ్యక్తి. అలాంటి సభ్యులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు తనతోబాటు, పార్టీకి కూడా ఇమేజ్ వచ్చే విధంగా పనిచేశారు. ముఖ్యంగా పేద ప్రజలతో స్నేహంగా ఉంటూ వారికి కావాల్సిన కార్యక్రమాలు చేస్తూ, తన 35

ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో తనకంటూ పార్టీలో ఇమేజ్‌నే కాదు, పొలిటికల్ సినారియో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రత్యేకతను సంతరించుకున్న వ్యక్తి ఆయన.

ఆయన పెదనందిపాడులో లెక్చరర్‌గా పనిచేస్తూ, స్వర్గీయ ఎన్.టి.రామారావు గారు పార్టీ పెట్టిన తరువాత, తెలుగుదేశం పార్టీలో చేరి చిత్తూరు జిల్లా నుండి 1983, 1985, 1989, 1994, 1999, 2009లో 6 పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎవరైనా 6 పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలవడమంటే చాలా అరుదు. అలా చాలా తక్కువ మంది ఉన్నారు. అది కూడా ప్రజల ద్వారా 6 పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందడమంటే చెప్పుకోదగ్గ విషయం. అలాంటి సభ్యులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు ఈ రోజున మన మధ్యలో లేకపోవడం చాలా విచారకరమని తమ ద్వారా తెలియజేసుకుంటూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి కలిగించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ నేను శెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ నారా చంద్రబాబు నాయుడు:** అధ్యక్షా, సభ్యులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు చనిపోవడం, ఈ రోజు ఇక్కడ సంతాప తీర్మానం ప్రవేశపెట్టవలసి వస్తుందని నేను ఎన్నడూ ఊహించలేదు, మనమందరం మాట్లాడతామని కూడా ఊహించలేదు. అధ్యక్షా, ఆయన రాజకీయ జీవితాన్ని పరిశీలిస్తే, స్వర్గీయ ఎన్.టి.రామా రావు గారి పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీ పెట్టినప్పుడు 1982లో పార్టీలో చేరి, 1983లో ఎన్నికల్లో మొట్టమొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పటికి వారి వయస్సు 71 సంవత్సరాలు. 1947, జూన్, 09వ తేదీన చిత్తూరు జిల్లా, రామచంద్రాపురం మండలం వెంకటాపురం గ్రామంలో రామానాయుడు, రాజమ్మ దంపతులకు వారు జన్మించారు. ఆయన బిఎస్సీతోబాటు, ఎం.ఎ., ఎల్.ఎల్.బి. కూడా చదివారు. ఆయన రాజకీయాల్లోకి వచ్చేవరకు పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేయడం జరిగింది. ఆయనకు ఆ కళాశాలపై ఎంత ఇష్టమంటే, ఎప్పుడు సమయం దొరికినా ఆ కళాశాలకు వెళ్లి వస్తుండేవారు. అంటే, ఆ కళాశాలతో, అక్కడ పనిచేసేవారితో మంచి సంబంధాలు పెట్టుకుని ముందుకుపోయారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా వారు గెలుపొందారు. మూడుసార్లు మంత్రిగా పనిచేశారు. 1984లో విద్యాశాఖ మంత్రిగా, 1987లో అటవీ శాఖా మంత్రిగా, 1994లో ఉన్నత విద్యా శాఖా మంత్రిగా పని చేశారు.

అధ్యక్షా, సభ్యులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారికి ఒక ప్రత్యేకత ఉంది. మంచి వాగ్ధాటి ఉంది, ధారా ళంగా మాట్లాడగలుగుతారు. కమ్యూనికేషన్ కూడా చాలా పర్ఫెక్ట్‌గా చేస్తారు. నిరంతరం ప్రజల్లో ఉండే వ్యక్తి ఆయన. ఏ చిన్న ఫంక్షన్ జరిగినా అంటే చావు కావచ్చు, పెళ్లి కావచ్చు, లేకపోతే చిన్న చిన్న ఫంక్షన్లు అయినాసరే మంచి చెడుల న్నింటిలో కూడా ఎక్కడికక్కడ వారితో కలిసుండే వ్యక్తి. నిరంతరం ఒక దగ్గర కూర్చునే వారు కాదు. తిరుగుతూనే ఉండేవారు. ఏదో ఒక పని పెట్టుకుని మళ్లా ప్రజల్లోకి వెళ్లే వారు. ఆవిధంగా ఆయన ప్రజల్లో ఉండటమనేది ఒక హాబి. ఇక్కడ హాబి అనడం కంటే కూడా ఒక డిసిప్లిన్‌తో, క్రమశిక్షణతో, ఇది నా బాధ్యత, నేను చెయ్యాలి అనే పట్టుద లతో ముందుకు పోయారు.

అధ్యక్షా, చివరి రోజున అంటే ఫిబ్రవరి 02వ తేదీన చూస్తే, దళిత తేజం-తెలుగుదేశం అనే కార్యక్రమంలో భాగంగా నగరి నియోజకవర్గంలోని బజారువీధి, కావనూరు, మంగాడు గ్రామాల్లో తిరిగారు. అయితే, అప్పటికే ఆయనకు సుస్తీగా ఉంటే లోకల్‌గా డాక్టరుకు చూపించుకుని ట్రీట్‌మెంట్ తీసుకోవడం, అక్కడ నుండి హైదరాబాదుకు వెళ్లడం జరిగింది. హైదరాబాదులో కూడా హాస్పిటల్లో చూపించుకుని, ఆ తరువాత మళ్లీ ఇంటికెళ్లారు. రెండు రోజులు ఇంటి దగ్గర రెస్ట్ తీసుకున్నారు. కానీ, మళ్లీ సీరియస్‌గా ఉంటే హాస్పిటల్‌కు నడుచుకుంటూ వెళ్లి హాస్పిటల్లో అడ్మిట్ అయిన తరువాత ఒక్క రోజులోనే బాగా బలహీనమైపోయారు. అధ్యక్షా, ఫిబ్రవరి, 06వ తేదీన మంగళవారం అర్ధరాత్రి 12.00 గంటలకు వారు చనిపోయారు. ఆయన చనిపోయిన రోజు ఉదయం 06.00 గంటలకు నాకు ఫోన్ చేసి ఆయన చనిపోయారనే వార్త చెబితే షాక్ అయ్యాను. ఏమిటి ఈ వార్త వింటున్నాం అని ఆశ్చర్యం వేసింది. మా సెక్రటరీ నాకు ఫోన్‌చేసి సభ్యులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారికి ఈ విధంగా అయ్యిందంటే, నేను నమ్మలేకపోయాను. చాలా బాధాకరం. తరువాత వాళ్ల అబ్బాయిలతో మాట్లాడినప్పుడు జరిగిన సంఘటనలు చెప్పారు. అంటే విధి ఏవిధంగా పనిచేస్తుందనడానికి ఇదే నిదర్శనం అధ్యక్షా. ఆయన ప్రజలతో మమేకమయ్యేందుకు తిరగడం, జ్వరమొచ్చినా లెక్కచేయకుండా ప్రజల్లోకి పోవడం, దాన్ని సరిగ్గా డయోగ్నోస్ చేయలేకపోవడం, చివరికి వచ్చేసరికి అది చాలా వరకు సీరియస్ కావడం, మనిషి పూర్తిగా కొలాప్స్ అయ్యే పరిస్థితి వచ్చింది.

ఉ. 10.10

అధ్యక్షా, శ్రీ గాలి ముద్దుకృష్ణమనాయుడు గారికి రాజకీయాలలో ఒక ప్రత్యేక స్థానం ఉంటుంది. ఎందుకంటే చాలా అరుదైన వ్యక్తులలో ఆయన ఒకరు. 35 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎక్కడా రాజీ పడకుండా నిద్ర లేచినప్పటి నుండి పడుకునేవరకు ప్రజాసేవలో ముందుండేవారు. అరగంట సమయం దొరికితే ఏదో ఒక పని చేయాలని ముందుకు వెళ్లేవారు. ఒక గంట సమయం దొరికితే ఒక గ్రామానికి వెళ్లి వచ్చేవారు. మరొకపక్క చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అందరికీ అందుబాటులో ఉండేవారు. "ముద్దన్నా" అని అందరూ ఆయనను ఆప్యాయంగా పలకరించేవారు. ఎవరితోనూ గొడవలు ఉండేవి కాదు, అజాతశత్రువుగా ఉండేవారు. అందరికీ మంచి చేయాలనే తపన ఉండేది. నా దగ్గరకు వచ్చేటప్పుడు కూడా కట్టలు కట్టలు కాగితాలు తెచ్చేవారు. ఇన్ని ఎలా చేస్తామని నేను అంటే, అందుకు ఆయన ఏదో ఒకటి చేయండి సార్, చేయాలి కదా అనేవారు తప్ప ఎన్నడూ నిరుత్సాహపడేవారు కాదు. ఇవన్నీ తలుచుకోవడం చాలా బాధాకరం. విధి మనచేతుల్లో లేదు అధ్యక్షా.

శ్రీ గాలి ముద్దుకృష్ణమనాయుడు గారు చేసిన పనులు రాష్ట్రంలో మరీ ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో నగరి, పుత్తూరు నియోజకవర్గాలలో శాశ్వతంగా మిగిలిపోతాయి. వారు చాలా సింపుల్‌గా ఉంటారు. ఎప్పుడూ ఒంటరిగానే తిరుగుతారు. పెద్దగా హంగామా ఏమి ఉండదు. మామూలుగా ఒక సాధారణ రాజకీయ నాయకుడంటేనే హంగామా ఉంటుంది. అలా కాకుండా ఆయన చాలా సింపుల్‌గా ఉంటారు. ఎన్నో సందర్భాలలో కార్లో ఒక్కరే వెళ్లేవారు. ఇటువంటివన్నీ నేను చూశాను. ఒక సందర్భంలో డిఫర్ అయినప్పుడు కొన్నాళ్లు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఎటువంటి

సందర్భంలోనైనా కూడా పద్ధతి ప్రకారం ముందుకు వెళ్లే వ్యక్తి ఆయన. ఏదేమైనా ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు, బాధాకరం. ఈ సభలో చాలా యాక్టివ్‌గా ఉండేవారు. ఆ వయసులో కూడా ఎంతో యాక్టివ్‌గా ఉండడం విశేషం. నాకు బాగా గుర్తున్న విషయమేమంటే సి.ఎం. రిలీఫ్ ఫండ్ కోసం ఒక పెద్ద కట్ట తీసుకువచ్చేవారు. ఇన్ని ఎలా ఇస్తామండీ అని నేను అంటే, కాదండీ వారంతా పేదవారు, వారందరికీ ఇవ్వాలని నా మీద ఒత్తిడి తీసుకువచ్చి పనులు చేయించేవారు. మరెన్నో మంచి పనులు చేశారు. అలాంటి మంచి వ్యక్తిని పోగొట్టుకోవడం చాలా బాధాకరం. ఏదేమైనా ఆయన ఆశయాలు మన ముందు ఉన్నాయి. వారు చూపించిన సింప్లిసిటీ ఉన్నది. ముద్దుకృష్ణమనాయుడు గారు రాబోయే తరాలకు కూడా రాజకీయాలలో ఆదర్శంగా ఉంటారు. ప్రజలతో ఎలా మమేకం కావాలి, ప్రజలను ఎలా పలకరించాలి, రాజకీయాలలో ఎలా కమ్యూనికేషన్ చేయాలనే విషయాలలో ఆయన మనకు ఆదర్శం. నమ్ముకున్న సిద్ధాంతం కోసం నిరంతరం పనిచేసే వ్యక్తిగా గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఆదర్శప్రాయులై శాశ్వతంగా నిలచిపోతారు. అలాంటి వ్యక్తి మరణం పట్ల నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను. వారి కుటుంబ సభ్యులందరికీ నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**డా. కామినేని శ్రీనివాస్:** అధ్యక్షా, గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు ప్రజాజీవితంలో దాదాపు 35 సంవత్సరాలు గడిపారు. సామాన్య ప్రజలతో మమేకమైన వ్యక్తి ఆయన. మనందరికీ ఎంతో ఆదర్శప్రాయుడు. ఎంత చిన్న ఫంక్షన్ అయినా తప్పకుండా హాజరై అందరితో కలిసిపోయే వ్యక్తిత్వం ఆయనది. వారు లేకపోవడం ఈ రాష్ట్రానికి తీరని లోటు. సంవత్సరకాలంగా నేను ఆయన కనిపించినప్పుడల్లా మీ హెల్త్ సరిగా లేదు, నాకు కొంచెం తేడాగా కనబడుతున్నది, మీ చూపులో వాక్యూమ్‌లాగా కనబడుతున్నదని చెబుతుండేవాడిని. అందుకాయన చూపించుకుంటాను బ్రదర్ అని చెప్పేవారు. ఈనాడు వారు మన మధ్యలేకపోవడం దురదృష్టకరం. నేను ముఖ్యమంత్రిగారిని కోరేదేమంటే చిత్తూరు జిల్లాలో నగరిలో గానీ, పుత్తూరులో గానీ విద్యాసంస్థలకు వారి పేరు పెట్టాలి. అటువంటి ఆదర్శవాదులను మనం గౌరవించుకోవాలి. ఏదైనా సంస్థలకు వారి పేరు పెట్టి ప్రజలు పదికాలాలు వారిని గుర్తుంచుకునేలా చేయాలని కోరుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను.

**శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి:** అధ్యక్షా, గాలి ముద్దుకృష్ణమనాయుడు గారితో నాకు దాదాపు 30 సంవత్సరాల అనుబంధం. 1982వ సంవత్సరం నుండి వారు పార్టీలో ఉన్నారు. నేను విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు వారు మరణించారన్న వార్త వినగానే షాక్‌కు గురయ్యాను. ఆయన outspoken person. వారు చెప్పదల్చుకున్నది అందరితో ఓపెన్‌గా షేర్ చేసుకునేవారు. వారు లెక్చరర్‌గా ఉంటూ సడెన్‌గా రాజకీయాలలోకి వచ్చిన తరువాత వారి గురించి అందరూ గొప్పగా చెప్పుకునేవారు. అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు వారి ఛాంబర్ అంతా అటవీ ప్రాంతంగా తీర్చిదిద్దేవారు. విద్యాశాఖా మంత్రిగాచేసినా, అటవీ శాఖా మంత్రిగా చేసినా తనదైన ముద్ర వేసుకున్న నాయకుడు ముద్దుకృష్ణమనాయుడు గారు.

సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో గానీ, ఇతర ఇష్యూలు వచ్చినప్పుడు గానీ చొరవ తీసుకుని ఆ అంశాలపై మాట్లాడడం, ధైర్యంగా అన్ని విషయాలను షేర్ చేసుకునేవారు. ఉద్యమంలో ముందుకు వెళ్లేవారు. అటువంటి సందర్భంలో మాబోటి వారు ఎవరైనా యాక్టివ్‌గా రోల్ తీసుకుని పార్టిసిపేట్ చేసినప్పుడు మరుసటి రోజునే టెలిఫోన్ చేసి మమ్మల్ని అభినందించేవారు. మీరందరూ బాగా చేస్తున్నారు, ఇంకా ముందుకు వెళ్లాలని మమ్మల్ని ప్రోత్సహించేవారు. ఏదేమైనా రాజకీయాలలో ఆయన జీవితాన్ని చూసినప్పుడు, dedicated, service oriented, ప్రజాసేవకు అంకితమైన వ్యక్తిగా మనకు కనిపిస్తారు. అటువంటి సీనియర్ నాయకుడు చనిపోయారంటే నమ్మలేని పరిస్థితి వచ్చింది. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ సోము వీర్రాజు(శాసనసభా నియోజకవర్గం):** శ్రీ నందమూరి తారక రామారావుగారిని ఆదర్శంగా తీసుకుని రాజకీయాలలోకి ప్రవేశించిన వ్యక్తి గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు. ఆరుసార్లు ప్రజాప్రతినిధిగా, అనేకశాఖలలో మంత్రిగా పనిచేశారు. ముఖ్యంగా వారు పెద్దలందరూ మాట్లాడిన విషయాలను బాగా గమనించేవారు. మేము ఈ మధ్యకాలంలో ఈ సభలో ప్రవేశించిన తరువాత వారు ఈ సభలో మాట్లాడినప్పుడు వారి అనుభవాన్ని మేము గమనించాము. వారి రాజకీయ జీవితం అందరికీ ఆదర్శంగా ఉండాలి. వారి జీవితాన్ని గమనించినట్లైతే ఎన్నో విషయాలను నేర్చుకోవచ్చు. మనం నిరంతరం రాజకీయాలలో ఉన్నాం, రాజకీయాలలోకి రమ్మని మనలను ఎవరూ కోరరు. మనకు మనమే తీసుకున్న నిర్ణయమిది. ప్రతిరోజూ ప్రజా సేవ చేస్తూ వెళ్లడమే, నిర్ణయాలు ప్రజలు తీసుకుంటారనేది వారి జీవన గమనాన్ని గమనిస్తే మనకు అవగతమవుతుంది. ఆరోగ్యం మరియు ఇసుకకు సంబంధించిన రెండు సందర్భాలలో వారు ఈ సభలో చాలా ధైర్యంగా మాట్లాడారు. అప్పుడు నేను ప్రతిపక్షంలో ఉన్నానా, పాలకపక్షంలో ఉన్నానా అని కూడా వారు ఆలోచించలేదు. అధికార యంత్రాంగం ఏ విధమైన నిర్ణయాలు తీసుకుంటున్నదో తెలియడం లేదు, నా నియోజకవర్గంలో జరిగిన అంశం నన్ను బాధపెడుతున్నది, నేను చాలా ఇబ్బందులు పడుతున్నాను అని చాలా గట్టిగా, నిర్భయంగా మాట్లాడారు. వారు చాలా outspoken గా ఉండేవారు. వారు చెప్పే విషయాలు వినడానికి ఎవరికైనా సరే చాలా ధైర్యం కావాలి. నేను వారిని వ్యక్తిగతంగా కలిసినప్పుడు "ఎవరినీ లెక్కజేయను, వాస్తవాన్ని స్పష్టంగా మాట్లాడతాను అనేవారు". ఇది భగవంతుడు వారికిచ్చిన గొప్ప లక్షణం. వారిని త్వరగా భగవంతుడు తీసుకువెళ్లడమనేది బాధాకరం. ఈమధ్యనే ఎంఎల్‌సి అయిన మాలాంటి వాళ్లం పెద్దలు గాలిముద్దుకృష్ణమనాయుడు గారిని కోల్పోవడమనేది డైజెస్ట్ చేసుకోలేకపోతున్నాము. అయినప్పటికీ భగవంతుడి నిర్ణయాన్ని అందరం ఆమోదించాలి. వారి ఆత్మకు సద్గతులు ప్రాప్తించాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం(ఉపాధ్యాయ నియోజకవర్గం – చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు):** ఈ సభ ప్రారంభమయ్యే నాటికి గాలి ముద్దుకృష్ణమనాయుడు గారు మన మధ్యన లేకపోవడమనేది ఊహించడానికి కూడా కష్టంగా ఉన్నది. 1984వ సంవత్సరం నుండి మేము ఉపాధ్యాయులుగా అనేక సందర్భాలలో వారిని కలిసేవాళ్లం.

అధ్యాపకులుగా పనిచేస్తూ విద్యాశాఖ మంత్రి బాధ్యతలు స్వీకరించారు కాబట్టి ఆ సమస్యలను అర్థం చేసుకోవడం గానీ, మమ్మల్ని అర్థం చేసుకోవడంలో గానీ ముందుండేవారు. ఆ రకంగా మా మధ్య ఒక ఆప్యాయతతో కూడిన అనుబంధం చిరకాలంగా ఏర్పడింది. ఆ తరువాత నేను ఎం.ఎల్.సి.ని అయ్యేనాటికి వారు ప్రతిపక్షంలో ఉన్నారు. రెండు మూడు సార్లు వారిని కలుసుకుని వారి దగ్గర చాలా విషయాలను తెలుసుకునే ప్రయత్నం చేశాను. వారిమీద మాకు ఎక్కువ గౌరవానికి కారణమేమంటే, నాకు తెలిసినంతవరకూ నా మూడు నియోజకవర్గాలలో పుత్తూరు అంతటి పెద్ద విద్యాకేంద్రం మరెక్కడా లేదు. పుత్తూరు, అక్కడకు పది, పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉండే నగరి, కార్వేటి నగరం ఈ మూడు ప్రాంతాల మండల హెడ్‌క్వార్టర్లలో డిగ్రీ కాలేజీలు, జూనియర్ కాలేజీలు ఉన్నటువంటి ఏకైక ప్రాంతం పుత్తూరు.

ఉ. 10.20

విద్యారంగం నుంచి వచ్చినటువంటి ముద్దు కృష్ణమ నాయుడుగారు విద్యాశాఖ మంత్రిగా ఉండడమే గాకుండా, విద్యా రంగం అభివృద్ధి చెందితేనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఒక స్పష్టమైన దృష్టికోణంతో ఉన్నందువల్లనే అక్కడ అభివృద్ధి సాధ్యమైంది. ఇటీవల ఆ ప్రాంతానికి వెళ్ళి అక్కడి కళాశాలలను చూసినప్పుడు ముద్దు కృష్ణమనాయుడుగారు విద్యారంగం నుంచి వచ్చారు కాబట్టే అక్కడ కళాశాలలు వచ్చాయని అనుకుంటున్నాను.

సాధారణంగా విద్యారంగం నుంచి రాజకీయ రంగంలోకి రావడమనేది కష్టమైన పని. రాజకీయాలు దానికి అంగీకరించవు. అలాగే విద్యారంగంలో ఉన్న వాళ్ళు కూడా రాజకీయాల్లోకి వెళ్ళడానికి అంగీకరించరు. ఒకవేళ ఈ ఇద్దరూ అంగీకరించి లోపలికి ప్రవేశిస్తే ఇందులో ఇమడడం కానీ, నెట్టుకుని రావడంకానీ సాధ్యమయ్యేది కాదు. కానీ, ముద్దు కృష్ణమనాయుడుగారు తన అనుభవంతో అది సాధ్యమవుతుందని నిరూపించారు. విద్యారంగం నుంచి వచ్చి సమాజానికి సేవ చేయగలమని నిరూపించిన వ్యక్తిగా కూడా ఆయనను మేము గుర్తుపెట్టుకోక తప్పదు. ఆయన ప్రజల మనిషి. సీరియస్ రాజకీయ నాయకుడు. అంతేగాకుండా, ఒక పాతతరం ప్రజా సంబంధాలను కలిగిన రాజకీయ నేపథ్యమున్న వ్యక్తి. సభలో ప్రశ్నోత్తరాల సమయంలో చురుకైన వాడుగాను, కరుకైనవాడుగాను ఉండేవారు. ఇందాక సోము వీర్రాజు గారు కూడా చెప్పారు. ఏ మాత్రం శషభిషలకు అవకాశం లేకుండా అడగదలచుకున్న దానిని అడిగేవారు. రాబట్టుకోవలసిన సమాధానాన్ని రాబట్టుకోవడమనేది ఆయనకు ప్రజల మధ్యలో ఉండడం వల్లనే సాధ్యమైందని అభిప్రాయ పడుతున్నాను. ముద్దు కృష్ణమనాయుడులాంటి వాళ్ళు నిష్క్రమించడమంటే ఒక తరం రాజకీయాలే కాదు, ఒక తరహా రాజకీయాలు కూడా క్రమంగా కనుమరుగైపోతున్నాయేమోననే భావన కలుగుతోంది. అలాంటి మంచి వ్యక్తిని కోల్పోయినందుకు నాకు చాలా బాధగా ఉంది. మరి ఆయనకు నిజమైన నివాళి అర్పించాలంటే ఆయనలాగా రాజకీయాల్లో చురుకుగా, కరుకుగా ప్రజల మధ్య ఉండడం మినహా మరొక రూపంలో నివాళులు అర్పించలేమని అభిప్రాయపడుతూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ కంతేటి సత్యనారాయణ రాజు(నామినేటెడ్):** అధ్యక్షా, ముద్దు కృష్ణమనాయుడుగారు నాకు చిరకాల మిత్రులు. అనేక సందర్భాల్లో ఆయన చాలా విషయాలు నాతో మాట్లాడుతుండేవారు. ఎందుకో తెలియదు కానీ ఈ మధ్య కాలంలో కొంత ఆందోళనగాను, అసంతృప్తిగానూ ఉన్నారు. ఎక్కడ ఏ పని ఉన్నా పార్టీలకు అతీతంగా ఆయన మంత్రిగా ఉన్నప్పుడు కానీ, లేనప్పుడు కానీ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళి పని చేయించడం జరిగేది. ఏ పార్టీలో ఉన్నా కూడా ఆయన చెప్పదలచుకున్నది స్పష్టంగా చెప్పేవారు. ఆయనకు జంకులేదు. గతంలో ఆయన కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ఒకసారి ఒక సందర్భంలో మున్సిపల్ ఛైర్మన్ నిధులిస్తే వేరే పార్టీ వాళ్ళందరికీ పంచి పెట్టేశారు. ఆరేడు సంవత్సరాలు నేను డిసిప్లినరీ కమిటీ ఛైర్మన్‌గా ఉండగా సుమారు 2000 మందికి పైగా నోటీసులివ్వడం జరిగింది. వాళ్ళని పిలిపించి ఇద్దర్నీ కూర్చోబెట్టి రాజీ చేశాను. కానీ, ఇతని విషయంలో వెంటనే పార్టీ నుంచి డిస్మిస్ చేశారు. అటువంటి ద్రోహం చేసి ఆరోజు ఆయనను ఓడించారు. ఆయనను ఏమైనా కావాలా అని అడిగితే నాకు ఏమీ అక్కర్లేదనే వారు. ముద్దాడ వెంకన్నను చూసి "వెంకాన్నా, మనం ఇలా కౌన్సిల్‌లో కూర్చున్నామంటే రాజుగారే కారణమయ్యా, శివరాజ్‌పాటిల్ ఆయనకు స్నేహితుడు, పట్టుబట్టి కౌన్సిల్‌ను తీసుకొచ్చాడు. మనందరికీ ఇక్కడ కూర్చునే అదృష్టం కలిగిందంటే ఆయనే కారకుడని" నిగర్వంగా చెప్పేవారు ఆ మహానుభావుడు. నేను మండవ వెంకటేశ్వరరావుగారు కలిసి ఉదయం నడుస్తున్నప్పుడు మాకు ముద్దు కృష్ణమగారు లేరనే వార్త తెలిసిన వెంటనే ఇద్దరమూ కూడా ఆసుపత్రికి వెళ్ళి వారికి శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుకుంటూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తి(స్థానిక సంస్థలు – విశాఖపట్టణం):** అధ్యక్షా, ముద్దు కృష్ణమనాయుడుగారు ఈ సభలో లేరని ఊహించడానికే చాలా బాధాకరంగా ఉంది. క్రిందటి సమావేశాలలో సభ జరుగుతున్నప్పుడు ప్రతిరోజు ఎంతో ఉత్సాహంగా అన్ని విషయాలలో ఆయన తరహాలో స్పందించేవారు. నిర్భయంగా, నిష్పక్షపాతంగా మాట్లాడడం ఆయన నైజం. 1983వ సంవత్సరం రామారావుగారు ఉన్నప్పటి నుంచి కూడా ఆయనతో నాకు పరిచయం ఉంది. మొట్టమొదట విద్యాశాఖ మంత్రిగా పదవి చేపట్టినప్పుడు ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలవల్ల ఈయనైతేనే విద్యాశాఖను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్ళగలరనే భావం తీసుకొచ్చారు. తరువాత మళ్ళీ 1987వ సంవత్సరంలో అటవీశాఖా మంత్రి అయ్యారు. ఆ సమయంలో విద్యాశాఖ లేదని ముందు కొద్దిగా బాధపడినా, తరువాత అటవీశాఖకే ఈయన వన్నెతెస్తారనే విధంగా ఆ శాఖను తయారుచేయగలిగారు. ఆ సందర్భంలో విశాఖపట్నం జంతు ప్రదర్శనశాలను సమర్థవంతంగా అభివృద్ధి చేయడంలో ఆయన పాత్ర ఎనలేనిది. ఈనాటికీ విశాఖపట్నం జంతు ప్రదర్శనశాలకు వెళ్తే ముద్దు కృష్ణమనాయుడు గారు అక్కడ చేసిన అభివృద్ధిని గురించి అక్కడున్న సిబ్బంది చెప్తుంటారు.

ముద్దు కృష్ణమనాయుడుగారు నిరంతరం సమాజం గురించి ఆలోచిస్తుండేవారు. ఆయన దగ్గర ఒక మంచి లక్షణం ఉండేది. ఏదైనా మంచి విషయం ఎక్కడైనా పబ్లిష్ అయితే వాటన్నింటినీ తీసి జాగ్రత్త చేసేవారు. అలా

చేయడంవల్ల విద్యాశాఖలో ఎప్పుడు ఏం జరిగిందో చెప్తూ, భవిష్యత్తులో దీనిని మళ్ళీ ఎలా మలచగలమని చెప్పేవారు. ఆయన ఒక ఉపాధ్యాయుడు. బోధించడమంటే ఆయనకు ఇష్టం. అటువంటి గొప్ప వ్యక్తిని మనం కోల్పోవడం దురదృష్టకరం, విచారకరమైన విషయం. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ ఎన్.అమరనాథ్‌రెడ్డి:** అధ్యక్షా, మన మధ్యనే ఒక ప్రజా నాయకుడుగా తిరుగుతూ, పేదల పక్షపాతిగా ఉండే ఒక నాయకుడ్ని ఈరోజు మనం పోగొట్టుకున్నాం. ఇలాంటి మాట్లాడే సందర్భం వస్తుందంటే కూడా అది బాధాకరమే. చిత్తూరు జిల్లాలో ముద్దు కృష్ణమనాయుడుగారికి పేదల స్వరం అనే పేరుంది. ఎవరైనా వారి సమస్య పరిష్కారం కోసం ఆయనను కలిస్తే నియోజకవర్గ స్థాయిలోకానీ, జిల్లా స్థాయిలో కానీ వాళ్ళ వెన్నంటి ఉండి వాళ్ళ సమస్యల్ని పరిష్కరించే స్వభావం కలిగినటువంటి వ్యక్తిగాను, క్రమశిక్షణ కలిగిన నాయకుడిగాను ఆయనకు పేరుంది. ఆయన తరువాతి తరాల వాళ్ళు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని పనిచేసేవారు. అలాంటి వ్యక్తిని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. శుభ కార్యమైనా, అశుభకార్యమైనా, పిలిచినా, పిలవకపోయినా, చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా నేరుగా వెళ్ళి పలకరించే స్వభావం ఉన్న వ్యక్తిగా ఆయనకు మంచి పేరుంది.

అదేవిధంగా, ఎవరు వచ్చినా వాళ్ళ కులం, వర్గం అనే తేడాలేకుండా వారందరికీ లెటర్లు ఇచ్చి పంపించేటటువంటి ఆనవాయితీ ఎప్పట్నించో ఉంది. దానివల్ల రోజుకు ఒక లెటర్‌హెడ్ పుస్తకం అయిపోయేది. గతంలో ఒకసారి ఎర్రచందనానికి సంబంధించిన స్మగ్లింగ్ సమయంలో తమిళ కూలీలపై ఎన్‌కౌంటర్ జరిగినప్పుడు ఎవరూ మాట్లాడే ధైర్యం చేయలేకపోతే, తమిళనాడు రాష్ట్రానికి సంబంధించిన వ్యక్తులు ఈ అడవుల్లోకి ఎందుకొచ్చారని ముద్దు కృష్ణమనాయుడుగారు అడిగిన తరువాతనే మిగిలిన అందరూ కూడా మాట్లాడే పరిస్థితి వచ్చింది. అంటే ఉన్న విషయాన్ని ధైర్యంగా చెప్పే స్వభావం కలిగిన వ్యక్తిగా ఆయన ఉన్నారు. అంతేగాకుండా మా తండ్రిగారితో కూడా వారు ఎక్కువ సంబంధాలు కలిగిన వ్యక్తి. లెక్చరర్‌గా ఆయన ప్రస్తానం మొదలై రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగి దాదాపు ఆరు దఫాలుగా శాసనసభ్యుడిగా, శాసన పరిషత్తు సభ్యుడిగా ఎంపికై జిల్లాలో ప్రత్యేకమైన ముద్రవేశారు. మొదటగా మంత్రి అయినప్పుడు ఆయన మంత్రిత్వశాఖకు సంబంధంలేకుండా వారి జిల్లాలో దాదాపు 1106 కి.మీ పంచాయితీ రహదార్లను ఆర్ అండి బి రహదార్లుగా మార్చారు. జిల్లాలో అధిక సంఖ్యలో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు రావడానికి ప్రధాన కారణం ఆయనే.

ఉ.10.30

అధ్యక్షా, ఈరోజు మా మండలంలో హైస్కూల్ ఉన్నదంటే అందుకు ఆరోజున ఆయన చూపిన చొరవే ప్రధాన కారణం, ఇటువంటి ఎన్నో ప్రజాసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ అందరికి సుపరిచితంగా ఉండే వ్యక్తిని ఈరోజున కోల్పోవడమనేది చాలా బాధాకరమైన సంఘటన. ఆయన మరణానికి ప్రగాఢమైన సానుభూతిని ఆయన కుటుంబ సభ్యులకు తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ శెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ చిక్కాల రామచంద్రరావు(స్థానిక సంస్థలు – తూర్పుగోదావరి):** అధ్యక్షా, స్వర్గీయ శ్రీ గాలి ముద్దుకృష్ణమనాయుడుగారు పుత్తూరు నుండి, నేను తాళ్లరేవు నుండి ఎమ్ఎల్ఏగా 5 సార్లు ఎన్నికై కలిసి పనిచేశాము. రాజకీయ రంగంలో మంచి భావాలు కలిగి, రాజకీయాలకే ఆదర్శంగా ఉన్న వ్యక్తి శ్రీ గాలి ముద్దు కృష్ణమనాయుడుగారు. ఆయన అందర్నీ పలకరిస్తూ, ప్రతి ఒక్కరినీ గౌరవిస్తూ, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేసిన వ్యక్తి. అధికారంలో ఉన్నా, లేకపోయినా ఏ విషయంలోనైనా సరే మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసేవారు. ఆయన మంచి వక్త. చాలా చక్కగా మాట్లాడతారు. చక్కగా మాట్లాడడమే కాదు, సబ్జెక్ట్ మీద పూర్తి అవగాహనతో మాట్లాడే వ్యక్తి. అటువంటి వ్యక్తి మన మధ్యలో లేకపోవడం చాలా దురదృష్టకరం.

అంతేకాకుండా ఏవిషయంలోనైనా సరే చాలా కమిట్‌మెంట్‌తో పనిచేసే వ్యక్తి. మంచి విలువలు కలిగిన వ్యక్తి. అందరికి అందుబాటులో ఉండేవారు. మేము మరలా కౌన్సిల్‌లో ఎమ్.ఎల్.సి.లుగా కలుసుకున్నాము. అసెంబ్లీలో 1983వ సంవత్సరం నుండి 2004వ సంవత్సరం వరకు పనిచేశారు. స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావుగారి ప్రోత్సాహంతో మాలాంటి వారందరం రాజకీయాలలోకి రావడం జరిగింది. మంచి మిత్రుడిని కోల్పోవడం చాలా బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ బి.ఎన్.రాజసింహులు(స్థానికసంస్థలు – చిత్తూరు):** అధ్యక్షా, శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు 1982వ సంవత్సరంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆరోజు నుండి కూడా మేమందరం పార్టీలో కలిసి ఉన్నాము. ఆయన పెదనందిపాడులో కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తున్న సమయంలో స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారి పిలుపు మేరకు రాజకీయాలలోకి వచ్చారు. 1983వ సంవత్సరంలో ఎమ్.ఎల్.ఏ.గా ఎన్నిక కావడం జరిగింది. అప్పటి నుండి పుత్తూరు నియోజకవర్గం నుండి 5సార్లు, నగరి నియోజకవర్గం నుండి ఒకసారి ఎమ్.ఎల్.ఏ.గా ఎన్నిక కావడం జరిగింది. 2015వ సంవత్సరంలో ఎమ్.ఎల్.సి.గా రావడం జరిగింది. ఇక్కడకు వచ్చినప్పుడు నా పక్కసీటు ఆయనకు కేటాయించడం జరిగింది. కొన్ని సమస్యలు వచ్చినప్పుడు వారికి చెబితే సమస్య పరిష్కారానికి తమవంతు కృషి చేసేవారు. ఫిబ్రవరి 6వ తేదీ రాత్రి వారి డ్రైవరు ఫోన్‌చేసి శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడుగారు చనిపోయారని చెప్పినప్పుడు నిర్ఘాంతపోయాము. ఆయన చిన్నప్పటి నుండి కష్టపడి పైకి వచ్చారు. వారి తల్లిదండ్రులు చనిపోయిన తరవాత రామగిరిలో వారి మామయ్య వాళ్ల ఇంట్లో ఉంటూ చదువుకుని, జబల్‌పూర్‌లో ఎమ్.ఏ చేసి, లా పూర్తి చేసి పెదనందిపాడులో అధ్యాపకుడిగా పనిచేశారు.

శ్రీ గాలి ముద్దుకృష్ణమనాయుడి గారితో ఉన్న అనుబంధంలో రెండు విషయాలు మరచిపోలేనివి. ఒకటి శ్రీ గాలి ముద్దుకృష్ణమనాయుడు గారు విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు తిరుపతి ఎమ్.ఎల్.ఏ. మబ్బు రామిరెడ్డి గారు పాఠ్యపుస్తకాలకు సంబంధించి ఇష్యూ చేసినప్పుడు మా ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన కాణిపాకం దేవాలయంలో ప్రమాణం చేస్తామని చెప్పడం జరిగింది. ఆరోజున ముద్దుకృష్ణమ నాయుడిగారి తరఫున జిల్లా అధ్యక్షుడిగా నేను

ప్రమాణం చేయడం, మబ్బు రామిరెడ్డి గారు రాకపోవడం, ఆరోజు నుండి కూడా మబ్బురామిరెడ్డి గారు రాజకీయ జీవితం నుండి తప్పుకోవడం జరిగింది. అదేవిధంగా శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు అటవీశాఖా మంత్రిగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రిగారు ఎర్ర చందనం చెట్లను శేషాచలం అడవులలో పెంచాలనే ఆలోచన చేసినప్పుడు హెలికాప్టర్‌లో వెళ్లి అడవులలో విత్తనాలు చల్లించారు. ఈ రోజు మన రాష్ట్రానికి ఎర్ర చందనం ద్వారా సంపద వస్తోందంటే ఆరోజున ఆయన చేసిన కృషేనని చెప్పక తప్పదు. ఆయన చివరి రోజులలో కూడా అతని వద్ద డ్రైవర్‌గా పనిచేసిన చంద్ర అనే వ్యక్తికి న్యాయం జరిగేలా చూడాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అదే విధంగా 10 సంవత్సరాలు వేరే పార్టీలోకి వెళ్లినా సరే చిత్తూరు జిల్లాలో ఎక్కడ కనిపించినా మనం పేదవాళ్లకు న్యాయం చేయాలని చెప్పేవారు. అలాంటి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరంగా ఉంది. శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారి భార్య సరస్వతమ్మ గారికి, కుమారులు భాను, జగదీష్, కుమార్తె లావణ్య గారికి, వారి కుటుంబ సభ్యులందరికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ గౌనివారి శ్రీనివాసులు(నామినేటెడ్):** అధ్యక్షా, ముద్దన్నా అని చిత్తూరు జిల్లా ప్రజల చేత పిలిపించుకున్న వ్యక్తి ఈ రోజు లేకపోవడం అనేది చాలా బాధాకరమైన విషయం. నేను 1987వ సంవత్సరంలో ఎమ్.పి.పిగా వున్నప్పుడు వారు మంత్రిగా ఉండేవారు, వారు చాలా విషయాలు చెప్పేవారు, ఈవిధంగా నడుచుకోవాలని చెప్పిన విషయాలను మేము మరువలేకపోతున్నాము. శాంతిపురం మండల పరిధిలో హైస్కూల్ లేదని చెప్పగానే వెంటనే అక్కడ హైస్కూల్ ఏర్పాటు చేయించారు. ఎవరు వెళ్లి అడిగినా కాదనకుండా లెటర్స్ ఇచ్చేవారు, ఇవ్వడమే కాకుండా అధికారులకు ఫోన్ చేసేవారు. ఒకసారి నేను ఆయన దగ్గర ఉన్నప్పుడు ఒక ఆఫీసరుకు ఫోన్ చేసినప్పుడు ఆ రికమండేషన్‌కు సంబంధించి మెరిట్‌లో కావాలండి అని ఆఫీసర్ అంటే, ఆ మెరిట్‌లో ఉన్నట్లయితే మిమ్మల్ని ఎందుకు రెక్వెస్ట్ చేస్తాము, ఏదోవిధంగా సహకరించమని అధికారులను ఒప్పించారు.

నేను ఒక విషయాన్ని మరువలేను. మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నా భార్య హాస్పిటల్‌లో ఉంది. ఎవరు చెప్పారో తెలియదు గాని, ఆయన హాస్పిటల్‌కు వచ్చి చూసిన తరువాత హాస్పిటల్ బిల్స్ అన్ని ఇవ్వు, సి.ఎమ్. రిలీఫ్ ఫండ్‌కు అప్లై చేద్దామని చెప్పారు. ఎందుకు సార్, నాకు అవసరం లేదు, పార్టీపరంగా నేను వేరుగా ఉన్నాను అంటే నీకు ఎందుకు నేను చెప్పి ఇప్పిస్తాను అన్నారు. ఆయన అలా అనడాన్ని నేను మరచిపోలేకపోతున్నాను. ఆ విధంగా పార్టీతో సంబంధం లేకుండా ఎవరికి ఏ అవసరం వచ్చినా కూడా సహకరిస్తూ, జిల్లాలో మంచి కార్యక్రమాలు చేసిన వ్యక్తి లేకపోవడం చాలా బాధాకరమైన విషయం. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ టి.డి.జనార్ధన్(నామినేటెడ్):** అధ్యక్షా, శ్రీ గాలి ముద్దు కృష్ణమనాయుడు గారు ప్రజల మనిషి. ఆయన రాజకీయాలలో కొత్త ఒరవడిని సృష్టించారు. రెండవది, ప్రజలు ఏ సమస్యలు చెప్పినా సరే ప్రతి సమస్యమీద పనిచేసేతత్వం ఆయనది. పిలిచిన ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లేవారు. ఒక రాజకీయ నాయకుడు ప్రజలతో ఎటువంటి సంబంధాలు

పెట్టుకోవాలనే అంశానికి మంచి ఉదాహరణ. భావితరాల వారికి ఆయన నడచిన నడక ఒక ఆదర్శంగా ఉంది. అంతేకాకుండా రాజకీయాలలో పదవుల వలన వన్నె కొంతమందికి వస్తుంది. కొంతమంది వ్యక్తుల వలన పదవులకే వన్నె వస్తుంది. ఈయన ఈతరం మనిషి. ఏ పదవిలో ఉన్నానరే రాణించి, ఆ పదవికే వన్నె తెచ్చేవారు. గౌరవ సభ్యులు చెప్పినట్లు, అటవీశాఖా మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరవాత కొంచెం ఇబ్బంది పడినా శాఖకే వన్నె తెచ్చే విధంగా పనిచేసిన వ్యక్తి శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు.

ఉ.10.40

అధ్యక్షా, శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా చిన్న వాళ్లలో చిన్నవాడిగా, పెద్దవాళ్లలో పెద్దవాడిగా ఉంటూ, అందరితో అన్యోన్యంగా ఉండే తత్వం ఆయనది. ఆయన లేని లోటు మనం పూడ్చలేనిది. ఏదిఏమైనా ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేసుకుంటూ, ఈ క్లిష్టపరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం వారి కుటుంబానికి భగవంతుడు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ బీద రవిచంద్ర(నామినేటెడ్):** అధ్యక్షా, ప్రజల నాయకుడుగా, సాధారణ వ్యక్తిగా, రాజకీయాలలో ఏ పదవిలో ఉన్నా, ఎంత సీనియర్ నాయకులైనా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేసిన ఒక గొప్ప నాయకుడు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు. రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ వారి యొక్క సేవల్ని కొనియాడాల్సిన పరిస్థితి ఉంది. పార్టీలో విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుంచి ముద్దు కృష్ణమనాయుడు గారితో నాకు పరిచయం ఉంది. ఒక సమస్య మీద ఆయన దగ్గరకు ఎవరు వెళ్లినా వారు స్పందించిన తీరు అమోఘం. చిన్న స్థాయిలో ఉన్న నాయకులు, కార్యకర్తలు వెళ్లినా వారు వెంటనే స్పందించి, అధికారులతో మాట్లాడి ఆ సమస్యల్ని పరిష్కరించడానికి ఆయన తీసుకున్న చొరవ మరువలేనిది. అటువంటి నాయకుడిని ఈ రాష్ట్రం కోల్పోవడం దురదృష్టకరం. అదేవిధంగా పెద్దలందరూ కూడా చెప్పినట్లు, ఆయన సామాన్యులకి చేస్తున్న సేవ చూస్తే, మేము ఆ జిల్లా వాళ్లం కాకపోయినా వారి నియోజక వర్గం కాకపోయినా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి తిరుపతిలోని బర్డ్స్‌లోనో, రూయా లోనో, స్విమ్స్‌లోనో ఎవరైనా పేషెంట్ ఉంటే, ముద్దన్నకి ఫోన్ చేసి చెప్తే పార్టీకో, లేదా ఎవరికైనా ముఖ్యులకో చెబుతారు, ఏదైనా మాట్లాడతారని అనుకుంటే వారే స్వయంగా వెళ్లేవారు. వారి నియోజకవర్గం, వారి ప్రాంతం కాకపోయినా ఎవరైనా పేదవారు హాస్పిటల్‌లో ఉన్నారంటే ఆయన స్వయంగా వెళ్లి వారిని పరామర్శించి, అధికారులకు చెప్పే ఒక గొప్ప వ్యక్తి, అటువంటి వ్యక్తిని ఈనాడు మనం కోల్పోయాము. భవిష్యత్తు తరాలకు కూడా ఆయన ఆదర్శవంతమైన నాయకుడు, ప్రజలకు సేవ చేయడంలో ఆయనను ఆదర్శవంతంగా తీసుకోవాలి. అంత గొప్ప వ్యక్తిని కోల్పోవడం దురదృష్టకరమని భావిస్తూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ పి. రామ సుబ్బారెడ్డి:** అధ్యక్షా, ఈరోజు కీర్తిశేషులు, గౌరవనీయులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారి సంతాప తీర్మానం సందర్భంగా చర్చించుకుంటున్నాము. ఈయన చూస్తే చాలా సీనియర్ నాయకుడు. మా పిన తండ్రి శివారెడ్డిగారితో కలిసి వారు తిరిగేప్పుడు, ఎమ్మెల్యేగా రాజకీయాలలో ఉన్నప్పుడు వారిని మేము చూస్తూ ఉండేవాళ్లం. అందులోనూ ఈ హౌస్‌లోకి వచ్చిన తరువాత చాలా సందర్భాలలో వారితో కలిసి కూర్చొని మాట్లాడాను. సభ్యులు చెప్పినట్లు సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా ఆయన వారి అనుభవాలను కూడా పంచుకునేవారు. మన గౌరవ ముఖ్యమంత్రిగారు అన్నట్లు అందరికీ ఆశ్చర్యం కలిగించే విధంగా చాలా యాక్టీవ్‌గా ఉన్నటువంటి వ్యక్తి. అలాంటి సీనియర్ నాయకులు, చనిపోయే సమయంలో నేను హైదరాబాదులోనే ఉన్నాను. ఉదయమే వారు చనిపోయారని తెలియగానే వెంటనే హాస్పిటల్‌కి వెళ్లి వారి భౌతిక కాయాన్ని హైదరాబాదు నుండి పంపించేంత వరకు మేమంతా అక్కడే ఉన్నాము. ఇది చాలా బాధాకరం. ఉన్నది ఉన్నట్లు మాట్లాడేవారు. ఏదైనా విషయంపై హౌస్‌లో మాట్లాడితే ప్రభుత్వ పరంగా ఏదైనా తప్పు ఉంటే తెలియజేసేవారు. ఆరోగ్య రంగం మీద చర్చిస్తున్నప్పుడు వారు ఒక అంశం మీద మాట్లాడుతూ, అప్పుడు మంత్రిగారు కూడా ఇక్కడే ఉన్నారు, ఈవిధంగా జరుగుతోంది, దీనిని సరిదిద్దండని ఓపెన్‌గా మాట్లాడిన వ్యక్తి శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు. అదేవిధంగా మొన్నకూడా ఒక విషయం జరిగింది. మన గౌరవ సభ్యులు చెప్పినట్లు, ఎవరిదైనా పెళ్లి అయినా, లేదా చనిపోయినా వెళ్లడం జరిగేది.

అదేవిధంగా మనం ఆయన గురించి మాట్లాడినప్పుడు కుటుంబంలో ఇద్దరు చనిపోతే ఆ కుటుంబాన్ని తప్పకుండా ఆదుకోవాలి, వారు ఇబ్బందుల్లో ఉన్నారని ముఖ్యమంత్రిగారికి చెప్పి, ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఒక్కొక్కరికి రెండు లక్షల చొప్పున మొత్తం నాలుగు లక్షలు శాంక్షన్ చేయించి, ఆ సొమ్మును ఆ కుటుంబానికి ఇవ్వడానికి అక్కడకు వెళ్లినప్పుడు, ఆ చనిపోయిన వారి బంధువు ఒకరు ఇంతేనా ఇచ్చింది అని అన్నారని చెబుతూ ఆయన బాధపడ్డారు. నేను కష్టపడి ముఖ్యమంత్రిగారికి చెప్పి ఆ కుటుంబానికి నాలుగు లక్షలు ఇప్పిస్తే, ఎవరో వచ్చి ఆవిధంగా మాట్లాడారని ఆయన అన్నారు. అంటే ఎవరో వచ్చి ఆపదలో ఉన్నామని అన్నా లేదా ఎవరికైనా సహాయం చేసే మనస్తత్వం ఆయనది. అలాంటి వ్యక్తి అనుకోకుండా దూరం కావడం చాలా బాధాకరం. అదేవిధంగా అలాంటి సీనియర్ నాయకుణ్ణి పోగొట్టుకోవడం కూడా ఈ రాష్ట్రానికి మరియు పార్టీకి చాలా నష్టం . వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ కుటుంబానికి నా సంతాపాన్ని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ కరణం బలరామకృష్ణ మూర్తి(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు గారు చాలా సీనియర్ రాజకీయ వేత్త. ఆయన పెదనందిపాడులో లెక్చరర్‌గా పనిచేస్తూ, ఎన్.టి.ఆర్ గారు పార్టీ పెట్టిన తరువాత దానిలో అనేక సందర్భాలలో విద్యార్థులతో గానీ, ఉపాధ్యాయులతో గానీ సర్వేలు చేయిస్తూ, పార్టీ భవిష్యత్తు గురించి, అక్కడ ఉన్న నియోజక వర్గాలలో ఉన్న పరిస్థితులను అంచనా వేసుకుని చెబుతూ ఉండేవారు. నాకు కూడా 1978 నుంచి వారితో వ్యక్తిగత పరిచయాలు ఉన్నాయి. ఆయన కాలేజీలో లెక్చరర్‌గా ఉన్నప్పుడు, నేను అద్దంకి ఎమ్మెల్యేగా 1978వ సంవత్సరంలో పనిచేసే వాడిని. అప్పటి నుండి వారితో నాకు సన్నిహిత సంబంధాలు

ఉన్నాయి. అదేవిధంగా ఇంకా పెద్దలు చెప్పినట్లు, ఏ కార్యక్రమమైనా వారి నోటీసులోకి వస్తే వారు పిలిచారా లేదా అనేది పక్కన పెట్టి వారిని పరామర్శించడం చేస్తుండేవారు. మేము గత శాసనపరిషత్ సమావేశాల్లో ఈ సభలోనే దాదాపు గంటన్నర పాటు మాట్లాడుకున్నాము. ఇప్పుడు వర్క్ లోడ్ కూడా ఎక్కువ అయిపోయింది. చిన్నపిల్లలకు ఓణీల ఫంక్షన్ పెట్టినా కూడా ఎక్కువగా తిరగాల్సి వస్తోందని వారు చెప్పడం జరిగింది. అంటే అందరినీ తృప్తి పరచాలనే ఆలోచనతో వారు ఆ పరిచయాలలో కష్టం ఉన్నా, నష్టం ఉన్నా, అదేవిధంగా వారితో ఆనందం పంచుకున్నా కూడా ఒక ప్రత్యేకమైన శైలిలో వారు ముందుకు వెళుతూ ఉండేవారు. దీనితోపాటు ఇప్పుడు ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలవడం జరిగింది. మధ్యలో చంద్రబాబునాయుడు గారు ఎమ్మెల్సీగా ఒక అవకాశం ఇవ్వడంతో, మళ్లీ యునానిమస్‌గా కూడా వారిని ఎంపిక చేయడం జరిగింది. దీంతోపాటు ఎన్.టి.ఆర్. గారి ప్రభుత్వ హయాంలో వారు విద్యాశాఖామంత్రిగా ఉన్నప్పుడు వారు చాలా ఎఫెక్టివ్‌గా పనిచేశారు. కొన్ని సందర్భాలలో అయితే నాకు పర్సనల్‌గా తెలుసు, ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా సరే అది న్యాయమైందని, ఆయనను ఒప్పించిన సందర్భాలు కూడా ఉన్నాయి.

అదేవిధంగా ఒక సందర్భంలో ఆయన నైతిక విలువలు ఏవిధంగా పాటించేవారంటే, పదవతరగతి పరీక్ష పేపర్ లీక్ అయిందని పెద్దయెత్తున పత్రికలలోవస్తే వారు వెంటనే పదవికి రాజీనామా చేసేశారు. తరువాత ఎన్.టి.ఆర్. గారు నచ్చ చెప్పినా కూడా సార్ అదేంటో తేలేంత వరకు నేను పక్కన ఉంటానని చెప్పి నైతిక విలువలు గల వ్యక్తి ఆయన. ఆ తరువాత వారు అటవీ శాఖా మంత్రిగా కూడా చేశారు. అవన్నీ కూడా సభ్యులు చెప్పడం జరిగింది. దీనితోపాటు వారు కుల, మతాలకు అతీతంగా పనిచేశారు. పైగా ఉమ్మడిరాష్ట్రంలో ఉన్నప్పుడు అన్ని జిల్లాలలో చాలామందితో పరిచయాలు ఏర్పరచుకున్నారు. అందువల్ల ఇప్పుడు వ్యక్తిగతంగా ఆయనను మరచిపోలేనటువంటి విషయం. దీనితోపాటు ఉపాధ్యాయ సంఘాలు మామూలు గానే అగ్రెస్సివ్‌గా ఉంటారు. అప్పుడు ఆయన దగ్గరకు వెళితే డీప్‌గా డిస్కషన్ చేసి దానికి పరిష్కారం చూపించేవారు. నేను అనుకోవడం ప్రకాశం జిల్లా కానీ, గుంటూరు జిల్లా కానీ, ఇతరత్రా తీర ప్రాంతాలలో ఉన్న నాయకుల్ని మేము మరచిపోయినా కూడా పేరు పేరున ఆయన గుర్తు పెట్టుకుని పిలుస్తారు. వాళ్లు కనపడినప్పుడు వాళ్లు ఎలా ఉన్నారు, వీళ్లెలా ఉన్నారని పరామర్శించే వ్యక్తి ఆయన. ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేనిది. ముఖ్యంగా వాళ్ల కుటుంబ బాధ్యతలు ముఖ్యమంత్రిగారికి కూడా తెలుసు కాబట్టి, భవిష్యత్తులో వారి కుటుంబానికి అండగా ఉండాలని, పార్టీపరంగా గానీ, వ్యక్తిగతంగా గానీ అందరికీ ఆ బాధ్యత ఉందని ముఖ్యంగా చంద్రబాబునాయుడుగారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని, ఆ కుటుంబ సమస్యలను పరిష్కరిస్తే బాగుంటుందని తెలియజేస్తూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్(స్థానిక సంస్థలు – కృష్ణా):** అధ్యక్షా, ఈ రోజు మన మధ్యన శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు గారు లేరంటే చాలా బాధాకరంగా ఉంది. ఆయన ఆరు సార్లు ఎమ్మెల్యేగా చేసినా, మాజీమంత్రిగా ఉన్నా కూడా వారు ఏ మాత్రం అహంకారం, అహంభావం లేకుండా అందరితో కలిసి పోయి కలివిడిగా ఉంటూ,

వారి యోగక్షేమాల్ని విచారిస్తూ, మంచి, మంచి సలహాలు, సూచనలు ఇస్తూ, ఏ మాత్రం సమయం దొరికినా ఆయన గత విషయాల్ని చక్కగా వివరిస్తూ, మమ్మల్నందరినీ ఎడ్యుకేట్ చేస్తూ ఉండేవారు. అయితే మన ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు, ఆయనను చూసి ఈ తరం నేర్చుకోవాల్సింది చాలా ఉంది.

ఉ.10.50

వచ్చిన వారందరికీ కులం, మతం చివరకు పార్టీలు కూడా చూడకుండా సహాయం చేద్దామనేటటువంటి ఉద్దేశంతో లేఖలు ఇవ్వడం, ఫోన్లు చేసి చెప్పడం ఆ రకంగా అందరికీ హెల్ప్‌ఫుల్‌గా ఉండడం అనేక చిన్నా, చితక కార్యక్రమాలకు కూడా హాజరయ్యి ప్రజలను సంతోషపెట్టాలనేటటువంటి ఆయన ఉద్దేశం నిజంగా చాలా గొప్పది. ఈనాటి రాజకీయాలలో ఆ తరహా పోకడలు ఉండేటటువంటి రాజకీయ నాయకులు తక్కువగా ఉన్నారనేది వాస్తవం. దానిని మనమందరం కూడా అంగీకరించాలి. అన్నగారు స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావుగారితో పాటుగా ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి హయాములో కూడా పనిచేసి మంచి నాయకుడుగా, మచ్చలేని మహా వ్యక్తిగా ఎంతో బోళా మనిషిగా పేరు తెచ్చుకున్నటువంటి మంచి మనిషి లేకపోవడం చాలా విచారకరం. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని ఈ సభాముఖంగా తమ ద్వారా తెలియజేసుకుంటున్నాను. ధన్యవాదాలు.

**శ్రీ బొడ్డు నాగేశ్వరరావు(పట్టభద్రుల నియోజకవర్గం - కృష్ణా, గుంటూరు):** అధ్యక్షా, పెద్దలు, గౌరవనీయులు, ఆదర్శమూర్తి శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు ఈరోజు సభలో లేకపోవడమనేది ప్రజలకే కాదు, మా లాంటి జూనియర్ శాసన మండలి సభ్యులకు కూడా ఒక లోటని మేము భావిస్తున్నాము. మేము ఉపాధ్యాయులుగా పనిచేసే కాలంలో వారు విద్యాశాఖా మాత్యులుగా వారిదైన ఒక చెరగని ముద్ర వేసుకున్నారు. ఆ విషయాలు మా సమావేశాలలో మా నాయకులు వారితో జరిపిన చర్చలను చెప్పేటప్పుడు మేము వింటూ ఉండేవాళ్ళం. ఆ విధంగా ఆయన ఒక చెరగని ముద్రను వేశారు. అంతేగాకుండా ఆయన శాసనమండలి సభ్యులుగా సభలోకి వచ్చిన తరువాత ఆయనతోపాటు మేము కూడా కలిసి కూర్చున్నప్పుడు ఈ సభలో ఆయన ప్రస్తావించే పలు విషయాలు మరియు ఈ సభా గౌరవాన్ని కాపాడడంలో వారు మా అందరికీ ఆదర్శమని మేము భావిస్తున్నాము. అధ్యక్షా ఒక విషయాన్ని తమ ద్వారా మనవి చేయదలచుకున్నాను. వారు ప్రజల సమస్యలను సభ దృష్టికి తీసుకు రావడంలో కానీ, అలాగే పాలక పార్టీలో ఉంటూ వివిధ శాఖలలో ప్రభుత్వ వైఫల్యాలను నిర్మొహమాటంగా సభలో చర్చించడమే కాకుండా చక్కని సూచనలతో ఏ విధంగా ప్రజా సమస్యలను పరిష్కరించవచ్చనేది సభ దృష్టికి తేవడమనేటటువంటిది మేము ఇక్కడ గమనించడం జరిగింది. ఇది కూడా మా అందరికీ ఆదర్శమని తమ ద్వారా తెలియజేస్తున్నాను. మరొక విషయం ఏమిటంటే పెద్దల సభగా ఉన్నటువంటి శాసనమండలిలోని విలువైనటువంటి చర్చలను, ప్రజా సమస్యలను ప్రజల దృష్టికి తేవడంలో ప్రెస్, మీడియా తగిన ప్రాధాన్యతను ఇచ్చేవిధంగా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలనే అంశాన్ని కూడా మొన్న జరిగిన సమావేశాలలోనే ఆయన ప్రస్తావించిన విషయాలను మేమయితే మర్చిపోలేకపోతున్నాము.

అటువంటి ఆదర్శ వ్యక్తి శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారికి ఈ సభ ద్వారా నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సంతాప, సానుభూతులను తెలియజేస్తూ, మాట్లాడడానికి అవకాశం ఇచ్చిన అధ్యక్షుల వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. సెలవు.

**శ్రీ రాము సూర్యారావు:** అధ్యక్షా, ప్రస్తుత పరిస్థితులలో ప్రతిపక్షం తన పాత్రను ఇప్పుడు నిర్వహించడం లేదు. అందువల్ల సమావేశాలలో అధికార పక్ష సభ్యులే ప్రతిపక్ష సభ్యుల యొక్క పాత్ర చక్కగా నిర్వహించండని, పలు ప్రజా సమస్యలను చక్కగా ముందుకు తీసుకురండని మన ప్రియతమ ముఖ్యమంత్రిగారే చెప్పడం జరిగింది. వాటిని నిర్వహించే ప్రథమ వ్యక్తులలో దివంగత శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు గారు ఒకరు. అలాగే, శాసనమండలి సభ్యులైన డా.ఎం.వి.వి.ఎస్.మూర్తిగారు, శ్రీ టి.డి.జనార్ధన్‌గారు ఇంకా చాలామంది సభ్యులు ఉన్నారు. ప్రతి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, మంత్రులను కూడా నిలదీసి గౌరవ ముఖ్యమంత్రిగారు అంత కష్టపడుతుంటే మంత్రులు ఎందుకు చేయరని అన్న మహనీయులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడుగారు. ఆయనతో ఎప్పటినుంచో నాకు సన్నిహిత సంబంధం ఉంది. అలాగే, 2017 జూన్ 4ను నేను ఎప్పుడూ మర్చిపోలేను. ఈనాడు పత్రికలో ఒక వార్త పడితే, ఆయన నాకు వెంటనే ఫోన్ చేసి, ఏమిటి మీరు ఎంతమందిని చదివిస్తున్నారు? పత్రికలో వార్త పడిందని అంటే, అప్పుడు నేను సార్ మా ఇంట్లో 52 మంది వరకు ఉన్నారని చెప్పాను. ఏంటి అంత మంది ఉన్నారా? ఎలా చదివిస్తున్నారు? అని అంటూ ఆయన నన్ను అభినందించారు. ఇది నా ఒక్కడి జీతం కాదు, ప్రజల సహకారంతో కూడా చదివిస్తున్నానని చెప్పడం జరిగింది. అంతేగాకుండా, మరొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే నేను సైకిల్ మీద వెళుతున్నప్పుడు ఆయన ఒకసారి నన్ను చూసి మీరు సైకిల్ మీద కూడా ప్రయాణం చేస్తారా అని అడిగి, నన్ను అభినందించే వారు. అలాగే నేను చేస్తున్న ఆసుపత్రిలో కూడా ఆయన స్వయంగా వచ్చి చూడాలని అన్నారు. కానీ నా దురదృష్టం ఆయన ఈలోపే చనిపోవడం బాధాకరం. నన్ను ఎంతో అభిమానించి, ప్రేమించే వ్యక్తి, సమాజానికి సేవ చేసే వ్యక్తి లేకపోవడం ఈ సమాజానికి తీరని లోటు. ఆయనని అందరూ ఆదర్శంగా తీసుకుని మెలగాలని, ఈ సభ ద్వారా ఆయనకు నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ ద్వారా నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను. ధన్యవాదాలు.

**శ్రీ కత్తి నరసింహా రెడ్డి(ఉపాధ్యాయ నియోజకవర్గం – కర్నూలు, అనంతపురం, కడప):** అధ్యక్షా, స్వర్గీయ శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు మన మధ్యనుంచి, ఈ లోకాన్ని విడిచిపోవడమనేది చాలా బాధాకరం. నిజంగా ఆయన పుత్తూరు, నగరి, చిత్తూరు జిల్లాకు మాత్రమే పరిమితమైనటువంటి వ్యక్తి కాదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు కలిగినటువంటి ఒక గొప్ప వ్యక్తి గాలి ముద్దు కృష్ణమ నాయుడు గారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రత్యేకించి నేను ఎస్.వి.యూనివర్శిటీ విద్యార్థి సంఘ నాయకుడుగా ఉండేటప్పుడు ఒక సమస్య పైన విద్యాశాఖా మంత్రిగా ఉన్న ఆయనను మేము కలవడానికి వెళ్ళినప్పుడు పరిచయం కలిగింది. దాదాపుగా 30 ఏళ్ళుగా వారితో అనేకమైన సందర్భాలలో కలిసినటువంటి ఒక ప్రత్యేకమైన అనుబంధం నాకూ, వారికి ఉంది.

పెద్దలు చెప్పినట్లుగా నిజంగా ఇప్పుడు ఉన్నటువంటి చాలా మంది రాజకీయ ప్రతినిధులు, రాజకీయాలలోకి రావాలనుకునే వారందరికీ ఆయన ఒక మార్గదర్శకుడని ఈ సందర్భంగా తమ ద్వారా తెలియజేస్తున్నాను. ఒక రోజులో ఒక ఎం.ఎల్.ఎ. గానీ, మంత్రులు అయినా ఎవరికైనా లెటర్లు ఇవ్వాలంటే కేవలం 10 గానీ, లేక 50 లెటర్లు ఇస్తారు. కానీ, ఒక రోజులోనే 1200 నుంచి 1500 వరకు లెటర్లు ఇచిన ఘనత కేవలం శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారికే దక్కుతుంది. చిత్తూరు జిల్లాలో కూడా, ఇతర చోట్ల అయినా ఏ కార్యాలయానికి వెళ్ళినా వారి సిఫారసు లేఖలు బల్లలపై ఉండేవి. నో అని చెప్పే అలవాటే ఆయనకు లేదు. ఆయన ప్రజల మనిషిగా చాలా అరుదైనటువంటి ముద్ర వేసుకున్నారు. ప్రత్యేకించి కొన్ని విలువలకు, ప్రజల సమస్యలు, విద్యా రంగానికి ఆయన చేసిన సేవలు అమోఘం. పుత్తూరు ప్రజలు ఓవర్ బ్రిడ్జి కోసం ఎదురు చూసేవారు. అది రెండు దశాబ్దాల కల. కేంద్ర మంత్రులు ఎవరు తిరుమల దర్శనానికి వచ్చినా పుత్తూరు ఓవర్ బ్రిడ్జి కోసం దరఖాస్తు ఇవ్వడం, ఆ బ్రిడ్జి కోసం వారు ఏం చేస్తారని చెప్పడం, వారు చేయకపోతే అడిగి ఆ బ్రిడ్జిని పూర్తి చేయించినటువంటి గొప్ప వ్యక్తి ఆయన. రెండు దశాబ్దాల కలని అక్కడి ప్రజలకు ఆయన నెరవేర్చారు. ఆయన తిరుమల పవిత్రతను కాపాడాలనే ఉద్దేశంతో తిరుమలలో రాజకీయ అంశాలు మాట్లాడకూడదనే ఉద్దేశంతో ఆయనకు ఆయన ఒక నిబద్ధత పాటించినటువంటి వ్యక్తి. అలాగే, ప్రత్యేకించి ఎవరు ఎక్కడ తటస్థ పడినా, సచివాలయానికి వచ్చినా ఎదురుపడినా ఎవరైనా మనిషి ఆయనకు కనపడితే – ఏమన్నా పనికోసం వచ్చావా అమ్మా, సెక్రటరీ దగ్గరకు, మంత్రి దగ్గరకు పోదాం రండి అని నేరుగా ఆ వ్యక్తులను పిలుచుకు వెళ్ళేవారు. ఆ విధంగా ప్రజల మనిషిగా మదిలో ఒక చెరగని ముద్ర వేసినటువంటి అరుదైన వ్యక్తి ఆయన. గత సంవత్సరం నవంబరు–22వ తారీఖున ఇదే సభలో డెంగ్యూ వ్యాధి వలన ప్రత్యేకించి తిరుపతి, చిత్తూరు, మదనపల్లి, వరదాయపాలెంలోని ఒక ప్రత్యేక ప్రాంతంలో కూడా దాదాపు 27 మంది వరకు చనిపోయినారు. ఆ డెంగ్యూ వ్యాధుల పట్ల, ఇతర వ్యాధుల పట్ల కూడా ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని చెప్పి ఒక విలువైన సూచన చేసి, అదే అనారోగ్యంతో మన నుంచి దూరం కావడమనేది చాలా బాధాకరమైనటువంటి అంశం. అలాగే, నేటి తరానికి కానీ, రాబోయే తరానికి కానీ వారు ఆదర్శనీయులు. వారి జ్ఞాపకార్థంగా తిరుపతి, చిత్తూరు, పుత్తూరు, నగరి, కార్వేటి నగరాలలోని ఒక విద్యా సంస్థకు చిరస్థాయిగా అందరికీ గుర్తుండేలాగా వారి పేరు పెట్టాలని తమ ద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను. అలాగే, వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు కూడా నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**డా.గాదె శ్రీనివాసులు నాయుడు(ఉపాధ్యాయ నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం):** అధ్యక్షా, గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు మూడుసార్లు మంత్రిగా పనిచేసినప్పుడు అందులో రెండుసార్లు విద్యాశాఖా మంత్రిగా పనిచేసి ఉపాధ్యాయ లోకానికీ, విద్యార్థినీ విద్యార్థులకు ఎన్నో రకాలైన మంచి కార్యక్రమాలు చేశారు. వారు మంత్రిగా ఉన్న సమయంలోనే ఎంతోమంది నిరుద్యోగ ఉపాధ్యాయులకు ఉద్యోగాలు రావడం కోసం జిల్లా సెలెక్షన్ కమిటీని కూడా వారి ఆలోచనల ద్వారానే నియమించి ఈనాటి వరకు కూడా ఆ కమిటీ

ద్వారానే నియామకాలు జరిగే పరిస్థితి కొనసాగుతోంది. వారు ఆరుసార్లు ఎంఎల్ఏగా ఎన్నికైనపుడు ఐదుసార్లు తెలుగుదేశం పార్టీ నుంచి, ఒకసారి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నిక కావడం జరిగింది. అటువంటి సీనియర్ నాయకుడు మన సభలో మా సహచర శాసన మండలి సభ్యులుగా ఉండడం మాకు ఎంతో గర్వంగా ఉండేది. ఎందుకంటే, చాలా మంది ఎంఎల్ఏలుగా, ఎం.పి.లుగా, మంత్రులుగా, ఐదు ఆరుసార్లు గెలిచిన వాళ్ళు శాసనమండలి సభ్యులుగా రావడం వలన మాలాంటి జూనియర్లకు వారు చెప్పే విధానం కానీ, వారు సభలో ప్రశ్నించే విధానం కానీ, సభ తాలూకు గౌరవాన్ని కాపాడే విధానం కానీ మాకు ఎంతో ఆదర్శంగా ఉండేది. అటువంటి సీనియర్ నాయకులు అకాలంగా ఇలా మరణించడమనేది చాలా బాధాకరంగా ఉంది. మూడు నెలల క్రితం వారు ఓపెన్ హార్ట్ సర్జరీ కూడా చేయించుకున్నారు. అనుకోకుండా మూడు నెలల తరువాత మళ్ళీ ఈ రకమైన దురదృష్టకరమైన వార్త వినడం చాలా బాధకరంగా ఉంది. వారు చేపట్టిన అభివృద్ధి పనులు చూసినట్లయితే, పుత్తూరులో ఓవర్ బ్రిడ్జితోపాటు, చిత్తూరు హైవే రోడ్డు గానీ, శాంతి థియేటర్ దగ్గర లెవెల్ క్రాసింగ్‌కు సంబంధించి కానీ, ఇంకా ప్రజలకు ఏవైతే ఇబ్బందికరమైన నిర్ణయాలని ఆయన భావిస్తారో వాటిని సాధించడం కోసం తమ శక్తివంచన లేకుండా, తమ వంతు బాధ్యతను నిర్వర్తించడం, దానికి ప్రాతినిధ్యం వహించడం వారి తాలూకు ప్రత్యేకమైనటువంటి విధానమని తమ ద్వారా తెలియజేస్తున్నాను. ఒకవేళ ఏదైనా విషయం ఉన్నట్లయితే అది స్వపార్టీయా, లేక విపక్షమా అనే ఆలోచన లేకుండా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడి దానిని ముందుకు తీసుకువెళ్ళడం కూడా వారి నైజం. మిగతా ఖాళీ సమయాలలో ఎక్కువగా పుస్తకాలు చదువుతూ, అందులోని ముఖ్యమైన విషయాలను అందరికీ చెపుతూ ఉంటారు. అది వారి అలవాటు. వారు మంచి అధ్యాపకులుగా ఉన్నప్పుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు తెలుగుదేశం పార్టీ పెట్టినప్పుడు యువకులకు, విద్యావంతులకు అవకాశం ఇచ్చిన నేపథ్యంలో వారు పార్టీపైన నమ్మకంతో ఉద్యోగాన్ని విడిచిపెట్టి ఎంఎల్ఏగా ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆయన ప్రజోపయోగమైన ఎన్నో రకాలైన కార్యక్రమాలు చేపట్టి, ఈనాడు మన మధ్యనుంచి దూరం కావడం బాధాకరం. వారికి, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, సెలవు తీసుకుంటున్నాను. ధన్యవాదాలు.

ఉ.11.00

**శ్రీ బచ్చుల అర్జునుడు(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, స్వర్గీయ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు ఎంతో ఆత్మీయంగా, ఆప్యాయతగా పలకరిస్తూ అందరి మన్ననలు పొందుతూ అందరూ మన వారే అనే స్వభావం కలిగి ఉండేవారు. ఆయనతో స్నేహ సంబంధం కలిగినటువంటి ప్రతి వ్యక్తి కూడా జీవితంలో వారిని మరువలేరు. మంచి వ్యక్తిత్వం కలిగినటువంటి వారు ఈ రోజున లేకపోవడం చాలా దురదృష్టకరం. వారిలో నాకు తెలిసినటువంటి విషయం ఆయన అటవీశాఖా మంత్రిగా ఉన్నప్పుడు కృష్ణాజిల్లా హెడ్‌క్వార్టర్ మచిలీపట్నం వచ్చారు. మేము వారిని స్వాగతించి మీరు ఏ ప్రోగామ్ కోసం వచ్చారని అడిగితే నేను ఒక పద్ధతి పెట్టుకున్నాను ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్‌కు మంత్రిగా వచ్చి ఆ జిల్లాలో ఏ సమస్యలు ఉన్నాయో వాటిని పరిష్కరించకపోయినా, తెలుసుకోవలసిన బాధ్యత నా

మీద ఉంది అనే వారి ఆలోచనను చెప్పడం జరిగింది. అదే సందర్భంగా అక్కడ నిరుపేదలైన 50 మంది గత ఐదారు సంవత్సరాలుగా రొయ్యపిల్లలు పెంచుకోవడానికి చిన్న చిన్న గుంటలు త్రవ్వుకున్న దగ్గర చాలా గొడవలు జరుగుతున్నాయి. ఆ సమస్యను వారి దగ్గర పెడితే 2 గంటలకు వెళ్లిపోవాల్సిన మంత్రిగారు ఆరోజు సాయంత్రం 6 గంటల వరకూ ఉండి కలెక్టర్‌గారిని, అటవీశాఖ అధికారులను, సంబంధిత అధికారులందరినీ కూర్చోబెట్టి ఆ సమస్యను పరిష్కరించారు. పేద వారికి చక్కని పరిష్కారాన్ని అందించినటువంటి మహనీయులు స్వర్గీయ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారే. అప్పటి నుండి ఇప్పటి వరకూ మా ప్రాంతంలో వారు మంచి గుర్తింపు తెచ్చుకున్నటువంటి మంత్రిగా పేద ప్రజల్లో నిలిచిపోయారు. పేద ప్రజల పెన్నిధిగా రాజకీయాల్లో ఉన్న వ్యక్తి పిలిచినా పిలవకపోయినా ప్రతి ఇంటికి వెళ్లి పలకరించడంతోపాటు వారి యోగక్షేమాలను చూసే ఆలోచన, అలాగే సమస్యలు పరిష్కరించే పద్ధతి ఆయన నుండి నూతనంగా రాజకీయాల్లోకి వచ్చిన వారు, మాలాంటి నూతన శాసనమండలి సభ్యులు ఆదర్శంగా తీసుకుని పనిచేసేటట్లయితే ప్రజల్లో మంచి గుర్తింపు రావడానికి అవకాశం ఉంటుంది. అలాంటి మంచి వ్యక్తి ఈరోజు మనలో లేకపోవడం చాలా దురదృష్టకరం. ఏది ఏమైనప్పటికీ, భగవంతుని నిశ్చయాన్ని ఎవరూ కాదనలేం కాబట్టి, స్వర్గీయ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారి ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబసభ్యులకు ప్రగాఢమైన సంతాపాన్ని సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ బుద్ధా వెంకటేశ్వర రావు:** అధ్యక్షా, స్వర్గీయ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు చనిపోవడం చాలా దురదృష్టం. శాసనమండలిలో వారికి సంతాప తీర్మానం పెట్టడం అంటే చాలా బాధగా ఉంది. స్వర్గీయ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు అస్యూరెన్స్ కమిటీ ఛైర్మన్‌గా జనవరి 22, 23 తారీఖులలో వారితోపాటు నేను కూడా శ్రీకాకుళం, విజయనగరం, అరకు ప్రాంతాలకు వెళ్లడం జరిగింది. ఆ మూడు ప్రాంతాలలో వారు ముఖ్యంగా డెంగ్యూ జ్వరం గురించే ప్రస్తావించి ఆ జ్వరాలను నియంత్రించడం కోసం అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగింది.

స్వర్గీయ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు మన ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారిని రేణిగుంట విమానాశ్రయంలో కలిసి 10 నిమిషాలు మాట్లాడాలని వారు అడగడంతో మన ముఖ్యమంత్రి గారు 10 నిమిషాలు కాదు అరగంట మాట్లాడదాము రండి అని ముద్దుకృష్ణమ నాయుడు గారిని ఆహ్వానించడం జరిగింది. వారు చనిపోయిన రోజు ఉదయం 7.15 గంటలకు హైదరాబాదు నుండి విజయవాడ వచ్చేందుకు ఫ్లైట్ టికెట్ తీసుకోవడం జరిగింది. అదే రోజు విజయవాడ వచ్చి వెళ్లడానికి టికెట్ తీసుకోవాలి ఎందుకంటే మన గౌరవ ముఖ్యమంత్రిగారికి దుబాయ్ పర్యటన ఉంది. వారిని కలసి విషయాలు మాట్లాడిన తరువాతనే నేను మరలా హైదరాబాదుకు వెళతానని చెప్పడం జరిగింది. కానీ ఈలోగా వారు తిరిగి రాని లోకానికి వెళ్లిపోవడం చాలా బాధాకరమైన విషయం. వారి దగ్గర నేర్చుకోవాల్సిన నిజాయితీ చాలా ఉంది. వారు టీచర్ అయినప్పటికీ కూడా పోరాట పటిమ ఉన్నటువంటి నాయకుడు. మేము అరకు వెళ్లినప్పుడు అక్కడ మొబైల్‌కు సిగ్నల్స్ లేవు అప్పుడు వారూ నేను మాట్లాడుకున్నాము. వారు ఎందుకు ఈ విషయాలన్ని చెప్పారో తెలియదు గానీ, 1989సంవత్సరం నుండి 1994వ

సంవత్సరం వరకూ మన ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ప్రతిపక్షాన్ని ఏవిధంగా లీడ్ చేశారో, వారిని ఏవిధంగా ఉపయోగించుకున్నారో, ఆ రోజు ముగ్గురు ముఖ్యమంత్రుల మీద ఏవిధంగా పోరాటం చేశారో అన్ని విషయాలు నాతో చర్చించారు. చివరగా ఇంకొక విషయం గురించి కూడా చెప్పారు. నిజాయితీగా వారు ఉండడమేకాకుండా ఇతరులను కూడా నిజాయితీగా ఉండమనడంలో ముద్దుకృష్ణమ నాయుడు గారు దిట్ట. ఒక టీచర్‌ను అయిన నన్ను శాసనసభ్యుడుగా చేసినటువంటి ఎన్.టి.రామారావు గారితోనే చివరి వరకూ ఉన్నాను. అలాగే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు విజయవాడ నగరంలో నిన్ను నమ్మి నీకు ఎన్నో పదవులు ఇచ్చారు. నీవు కూడా నీ శ్వాస విడిచే వరకూ ఆ కుటుంబాన్ని విడిచి పెట్టకూడదు అని ఇలాంటి నిజాయితీ గల మాటలు, వారు నమ్మిన సిద్ధాంతాన్ని ఇతరులకు కూడా చెప్పే గొప్ప నాయకుడు మన స్వర్గీయ గాలి ముద్దు కృష్ణమ నాయుడు గారు. అటువంటి నాయకులు ఉండడం చాలా అరుదు. ఎందుకంటే మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి దయ వలన గడిచిన రెండు సంవత్సరాలలో ఈ శాసనమండలిలో వారితో ఎక్కువ సన్నిహిత సంబంధం ఉంది. స్వర్గీయ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు విజయవాడ వస్తే గౌరవ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుగారి వియ్యాల వారింట్లోనే ఉండేవారు. మా ఇంట్లో భోజనం చేసేవారు. ఎంతో నిజాయితీగల వారు లేకపోవడం వారి ప్రక్కన కూర్చోవలసిన మేము వారి సంతాప తీర్మానంలో మాట్లాడడం మా దురదృష్టమని భావిస్తూ, వారు స్వర్గంలో ఉండి ఉంటారని, వారికి శాంతి కలగాలని, అలాగే స్వర్గీయ ముద్దుకృష్ణమ నాయుడు గారి లాంటి నిజాయితీపరులు ఈ రాజకీయాల్లో కొనసాగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

**శ్రీ పత్తిపాటి పుల్లారావు:** అధ్యక్షా, ఈ సభలో స్వర్గీయ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారి యొక్క సంతాప తీర్మానంలో పాల్గొనడం అంటే చాలా బాధాకరం. ఎందుకంటే మేమంతా ఆప్యాయంగా ముద్దన్నా అని పిలుచుకునేటువంటి మంచి నాయకుడిని కోల్పోవడం జరిగింది. మేమంతా ఆరోజు అంతిమ యాత్రలో పాల్గొన్నాము. రాష్ట్ర ప్రజలలో కూడా మంచి నాయకుడిని కోల్పోయామనే భావన, ఆవేదన కనపడుతుంది. అదే విధంగా, ఆయన ఉన్నంత కాలం రాష్ట్రప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి, వాటిలో ఉన్న లోపాలను గురించి నిష్పక్షపాతంగా మాట్లాడి గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకెళితే బాగుంటుందని మాకు మంచి సూచనలు, సలహాలు ఇచ్చేటువంటి మంచి నాయకుడిని కోల్పోవడం జరిగింది. అదే విధంగా, ఏ డెంగ్యూ వ్యాధితో అయితే వారు మరణించడం జరిగిందో ఇదే సభలో గత సమావేశాల్లో దాని గురించే గౌరవ మంత్రి డా. కామినేని శ్రీనివాస్ గారితో కూడా 15 నిమిషాలు చర్చించడం జరిగింది. అటువంటి వ్యాధితోనే వారు మరణించడం అంటే చాలా బాధాకరం.

అధ్యక్షా, స్వర్గీయ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు గుంటూరు జిల్లా, పెదనందిపాడు ఆర్ట్స్ కళాశాలలో పనిచేయడంతో గుంటూరు జిల్లాతో వారికి మంచి అనుబంధం ఉంది. అదేవిధంగా వారు ఎక్కడకు వెళ్లినా శ్రీ బుద్ధా వెంకటేశ్వర రావు గారు చెప్పినట్లు విజయవాడ వస్తే మా వియ్యాలవారు బసవయ్య గారింట్లో ఉండేవారు. గుంటూరు వస్తే కృష్ణకుమార్‌గారింట్లో ఉండేవారు. వారు ఎక్కడా హోటల్స్‌కు కూడా వెళ్లకుండా వీలైనంత వరకూ

వారి శిష్యుల దగ్గరనే ఉండి అక్కడే భోజనం చేసే మంచి సంప్రదాయంతో ఉండేవారు. వారు ఈ రాష్ట్రంలో ఎక్కడకు వెళ్లినా వారికి శిష్యులు తప్పకుండా ఉండేవారు. వారు అలాంటి మంచి సంప్రదాయాన్ని కొనసాగించారు.

అధ్యక్షా, స్వర్గీయ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు అస్యూరెన్సు కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించి ఎన్నో డిపార్టుమెంట్స్‌ను రెవ్యూ చేశారు. వారు చనిపోయిన రోజు 6వ తేదీన అస్యూరెన్సు కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. వారు ఆ ముందు రోజు నైట్ చనిపోవడం అనేది చాలా దురదృష్టకరం. వారు ఆరు సార్లు శాసనసభ్యులుగా వ్యవహరించారు. మన ప్రియతమ ముఖ్యమంత్రిగారు వారిని శాసనమండలికి కూడా తీసుకురావడం జరిగింది. అతి స్వల్ప మెజారిటీతోనే వారు ఓటమి పాలయ్యారు. అయినా కూడా మనోధైర్యంతో వారు రాజకీయాల్లో ఏ కార్యక్రమాన్ని వదలి పెట్టకుండా నిత్యం ప్రజల్లో ఉన్నటువంటి మంచి ప్రజానాయకుడు. మంత్రిగా పనిచేసి ఆ మంత్రి స్థానానికి గౌరవం పెంచారు. అటువంటి మంచి నాయకుడికి గౌరవ మంత్రి డా. కామినేని శ్రీనివాస్ గారు చెప్పినట్లు శాశ్వతంగా వారి పేరును విద్యా సంస్థలకు గానీ, ఆసుపత్రులకు గానీ ఏదొక సంస్థకు నామకరణం చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. వారి మరణం మా అందరినీ బాధించింది. ఏది ఏమైనప్పటికీ వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢమైన సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను.

ఉ.11.10

**శ్రీ గుండుమల తిప్పే స్వామి:** అధ్యక్షా, కీర్తి శేషులు, మాజీ మంత్రివర్యులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయడు గారు లేని లోటు ఎవరూ తీర్చలేరు. తెలుగుదేశం పార్టీ తరఫున హిందూపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి గత సంవత్సరం నన్ను పరిశీలకుడిగా నియమించారు. వారు హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గానికి వచ్చినప్పుడు అనేక రాజకీయ సూచనలు, అనంతపూర్ జిల్లా గురించి అనేక రాజకీయ సలహాలు ఇచ్చే వారు. ఆ సలహాలు, సూచనలు ఎంతో విలువైనవి. అవి మనం ఎప్పటికీ మరచిపోలేము. భవిష్యత్ మార్గదర్శకానికి కూడా అవి ఎంతగానో ఉపయోగపడుతాయి. అదే విధంగా, ఈ మధ్య కాలంలో నగరి నియోజకవర్గ పర్యటనకు వెళ్లినప్పుడు ప్రజలతో ఆయనకు ఉన్న సంబంధం చూసి నేను ఆశ్చర్యపోయాను. మరి అటువంటి వ్యక్తిని చూసి నిత్య విద్యార్థిగా నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి. కానీ, అటువంటి వ్యక్తి మన మధ్యన లేకుండా పోవడం చాలా దురదృష్టకరం. ఏది ఏమైతేనేమి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ఆయురారోగ్యాలు ఇచ్చి కాపాడాలని ఆ భగవంతుని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ నారా చంద్రబాబు నాయుడు:** అధ్యక్షా, గౌరవ శాసన మండలి సభ్యులందరూ ముద్దుకృష్ణమ నాయుడు గారితో ఉండే అనుబంధాన్ని గుర్తు చేసుకొని, వారి ఆదర్శ భావాలను ఒకసారి నెమరు వేసుకుని, ఏ విధంగా ముందుకు వెళ్లాలో నిర్ణయం తీసుకోవడం జరిగింది. వారిని నేను 37 సంవత్సరాలుగా చూశాను. ఆయన ఒక అరుదైన నాయకుడు, ఆయనకు ఒక అరుదైన శైలి కూడా ఉంది. ఆయనకంటూ రాజకీయాలలో ఒక ప్రత్యేకమైన స్థానం

ఉంటుంది. ఇంతకు ముందు చాలా మంది మిత్రులు చెప్పినట్లుగా చాలా వరకు ఎంత మంది వచ్చి అడిగినా కాదనకుండా, ఒక సమస్య పరిష్కారం కోసం ఎంత వరకు వెళ్లాలో అంత వరకూ వెళ్లే ప్రయత్నం చేసే వ్యక్తి ముద్దు కృష్ణమ నాయుడు గారు. మరళా ఏ సందర్భంలోనూ నిరుత్సాహపడే వారు కాదు. నేను ముఖ్యమంత్రిగా ఉన్న ప్రతిసారి నాకు వచ్చిన లెటర్లలో ఖచ్చితంగా ఒక లెటరు ముద్దుకృష్ణమ నాయుడు గారి పేరుతో ఉండేది. ఆవిధంగా ఎవరు వెళ్లినా లెటర్లు ఇవ్వడం, మరలా ఫోను చేసి చెప్పడం జరిగేది. ఆయన ప్రజాసమస్యల్లో పరిష్కారం కోసం అలుపెరుగని వ్యక్తి. ఏది ఏమైనా ఒకసారి విధి వక్రీకరించినప్పుడు డెస్టినీని ఎవరూ కాదనలేము. అయితే రాజకీయాలలో ఆయన స్ఫూర్తి ఎప్పుడూ ఉంటుంది. ఈ రోజు మనం ఏమి చేస్తామో అవన్నీ ప్రజలు గుర్తు పెట్టుకుంటారు. మనం ప్రవర్తించే తీరు, మనం చేసే పనులు రాజకీయలలో ఉండే ప్రతి ఒక్కరికీ శాశ్వతంగా గుర్తు ఉంటుంది. మనం ఎప్పటికప్పుడు ముద్దుకృష్ణమ నాయుడు గారంటే ఫలానా వ్యక్తి అని భావితరాలకు స్ఫూర్తినిచ్చి, అవి గుర్తుండేలా చూడాలి.

అందుకని రెండు విషయాలు ఆలోచించాను. అవి ఒకటి ఒక టీచర్‌గా పని చేస్తూ రాజకీయాలలోకి వచ్చి అరుదైన శైలిలో బ్రహ్మాండంగా విజయవంతం కావడం, అదే శాఖకు విద్యామంత్రిగా వ్యవహరించడం. ఇది సాధారణంగా జరుగదు. ఆయన నగరిలోని డిగ్రీ కళాశాల కోసం ఎంతో కృషి చేశారు. అందుకని ఆ డిగ్రీ కళాశాలకు ముదుకృష్ణమ నాయుడు గారి పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

(సభ్యుల హర్షధ్వానాలు)

అలాగే గాలేరు–నగరి ప్రాజెక్టును మన నాయకుడు నందమూరి తారక రామారావు గారు ఉన్నప్పుడు ప్రారంభించారు. దీని మీద గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు కూడా చాలా కృషి చేశారు. అక్కడ వేణుగోపాల సాగర్ అనే రిజర్వాయర్ వస్తుంది. ఇది పుత్తూరు మండలం నగరి నియోజకవర్గంలో వస్తుంది. దీని నీటి సామర్థ్యం సుమారు 2.67 టిఎంసిలు. ఇప్పుడు అది పూర్తి కావాల్సిన అవసరం ఉంది. దీని గురించి ఈ మధ్యనే రెవ్యూ చేశాను. ఒక సంవత్సరంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలను కుంటున్నాము. ఈ ప్రాజెక్టుకు కూడా గాలి ముద్దు కృష్ణమ నాయుడు గారి పేరు పెడితే బాగుంటుందనే ఉద్దేశంతో వేణుగోపాల సాగర్ రిజర్వాయర్‌కి గాలి ముద్దు కృష్ణమ నాయుడు గారి పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

(సభ్యుల హర్షధ్వానాలు)

ఎందుకంటే ఇలాంటివి చూసినప్పుడు రాజకీయాలలో ఉండే ప్రతి ఒక్క వ్యక్తి వారి జీవితాన్ని స్ఫూర్తిదాయకంగా తీసుకుని ముందుకు వెళ్లి, భావితరాలకు ఆదర్శం కావలసిన అవసరం ఉంది. మనిషిని తేలేము గానీ, ఆయన స్ఫూర్తిని ఎప్పటికప్పుడు మరలా గుర్తు పెట్టుకోవడానికి ఇలాంటి పేర్లు గుర్తుంటాయి. కాబట్టి డిగ్రీ కళాశాలకు, ఇరిగేషన్ ప్రాజెక్టుకు ముద్దుకృష్ణమ నాయుడు గారి పేరు పెడుతున్నామని తెలియచేసుకుంటూ, మరొక్కసారి వారి

ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, అదే విధంగా వారి కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

**చైర్మన్:** ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు కీర్తి శేషులు, గౌరవనీయులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియచేస్తున్నది. శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు 09 జూన్, 1947 చిత్తూరు జిల్లా, రామచంద్రాపురం మండలం, వెంకటరామాపురంలో జన్మించారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అధ్యాపకుడిగా పని చేశారు. 1983లో రాజకీయ రంగ ప్రవేశం చేసి నగరి నియోజకవర్గం నుంచి 6 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1984లో విద్యాశాఖ మంత్రిగా, 1987లో అటవీశాఖ మంత్రిగా మరియు 1994లో ఉన్నత విద్యాశాఖ మంత్రిగా సేవలు అందించారు. 2015లో చిత్తూరు స్థానిక సంస్థల నియోజక వర్గం నుంచి శాసన పరిషత్ సభ్యుడిగా ఎన్నిక కావడం జరిగింది. 07 ఫిబ్రవరి, 2018వ సంవత్సరం అంటే వీరి 71వ సంవత్సరంలో మరణించడం జరిగింది. వీరి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, రెండు నిముషాలు పాటు సభ్యులందరం మౌనం పాటిద్దాం.

(ఆ సందర్భంగా సభ రెండు నిముషాలు మౌనం పాటించింది)

**CHAIRMAN:** I have to acquaint the House that on 5th March, 2018, the Governor was pleased to Address the Members of both the Houses of Legislature, and a true copy of the Address has been laid on the table of the House.

## 2.సభా కార్యక్రమం – ప్రకటన:

I am to announce to the House that amendments to the Motion of Thanks to the Address by the Governor will be received by the Secretary to Legislature upto 2.00 p.m. on 7th March, 2018.

Now the House is adjourned to meet again at 10.00 a.m. tomorrow.

(The House then adjourned at 11.18a.m. to meet again on Wednesday, the 7th March, 2018)

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Council and printed at the AP Legislative Assembly Press, Velagapudi, Amaravati.**